మైలార్‌దేవ్‌పల్లిలో కురిసిన వర్షం

కర్నూల్ రోడ్డు అండర్ బ్రిడ్జిపై నిలిచిపోయిన వర్షనీరు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 7: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 40 నిమిషాల పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానగర్, కాటేదాన్, ఓల్డ్ కర్నూల్ రోడ్డు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

స్తంభించిన ట్రాఫిక్..

కురిసిన వానతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓల్డ్ కర్నూల్ రోడ్డులోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, ఆరాంఘర్‌లోని రైల్వే బ్రిడ్జి కింద ప్రాంతాల్లో నీరు నిలిచించి. దీనికి తోడు డ్రైనేజీలు నిండుకోవడంతో నీరు రోడ్లపైకి వచ్చింది. రెండు గంటల వరకు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయా యి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు అయ్యప్ప పడిపూజ

హిమాయత్‌నగర్ : కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం జరుగుతుందని బీజేపీ నగర ఉపాధ్యక్షుడు పందిర్ల ప్రసాద్ తెలిపారు. పడిపూజ జరిగే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఆ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎక్కాల నందు, ఏడెల్లి అజయ్ కుమార్, ఎక్కాల కన్నా పాల్గొన్నారు.

మా జోలికి వస్తే.. తాటతీస్తాం

హిమాయత్‌నగర్, డిసెంబర్ 7: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసనభ సభ్యత్వాన్ని తొలగించాలని అంధుల డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చొక్కారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే శంకర్ ఒక కులాన్ని కించపరిచి మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే వెలమలను దూషించడం సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యే అహంకార పూరితంగా ఒక సామాజిక వర్గంపై ఈ విధమైన బెదిరింపులు, దూషణలు చేయడం ఏ మాత్రం ఉపేక్షించామని హెచ్చరించారు. తమ ఆత్మగౌరవం దెబ్బతినేలా ఎమ్మెలే వ్యాఖ్యలు చేశారని, తాను ఒక అంధుడినైనప్పటికీ ఈ విషయంలో స్పందిస్తున్నా నని తెలిపారు. ప్రజలచేత ఎన్నికైనా ప్రజా ప్రతినిధులు సభ్యత సంస్కారం నేర్చుకోవాల న్నారు. సాధారణ ప్రజలు మాట్లాడితే కేసులు పెడుతున్నారని, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శంకర్‌పై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి పదవికి ఆశపడి నోటికి వచ్చినట్లు ఎమ్మెల్యే మాట్లాడుతున్నాడని వెలమల జోలికి వస్తే తాటతీస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ నాయకులు లక్ష్మారెడ్డి, పరమేశ్, భట్టు రాములు పాల్గొన్నారు.



హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొక్కారావు

అకృత్యాలు ఆపేలా చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఐవీఓబీపీఎఫ్ జాతీయ అధ్యక్షుడు బీఎన్‌వీ రాజశేఖర్

ఖైరతాబాద్, డిసెంబర్ 7: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను ఆపేలా కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇండియన్ విశ్వకర్మ ఆఫీసర్స్ బిజినెస్ మ్యాన్, ప్రొఫెషనల్స్ ఫౌండేషన్(ఐవీఓబీపీఎఫ్) జాతీయ అధ్యక్షుడు బీఎన్‌వీ రాజశేఖర్ కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. భారత్ వల్ల స్వాతంత్ర్యాన్ని పొందిన బంగ్లాదేశ్ మన వారిపై దాడులకు తెగబడటం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన చిన్మోయ్ కృష్ణ దాస్, మరో ఇద్దరు సన్యాసులను విడుదల చేసేలా భారత్ ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కుమార్, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక చింతనతో.. మానసిక ప్రశాంతత

హిమాయత్‌నగర్, డిసెంబర్7 : ఆధ్యాత్మిక చింతనతోనే మనకు మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ కార్పొరేటర్ జె.హేమలత యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జె.బాబుయాదవ్ అన్నారు.

శనివారం నారాయణగూడలోని సాయిబాబా శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా గోపూజ, భస్మాభిషేకం, రుద్రాభిషేకం, 11 విధాల మంగళ హారతులు, దీపోత్సవం జరిగాయి. కార్యక్రమంలో వారు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.

మాక్స్‌సొసైటీ డైరెక్టర్‌గా అన్నపూర్ణ పటేల్

మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ వినియోగదారుల సహకార సంఘం (మాక్స్ సొసైటీ) రాష్ట్ర డైరెక్టర్‌గా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన మీడవెల్లి అన్నపూర్ణ పటేల్ నియమితులయ్యారని సంఘం సీఈవో పుటం పురుషోత్తం రావు తెలిపారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందజేశారని పేర్కొన్నారు.

- బంజారాహిల్స్

వేగవంత పూడికతీతకు.. మినీ జెట్టింగ్ కమ్ డీ సిల్టింగ్ మిషన్

జూబ్లీహిల్స్‌లో పనులు చేపడుతున్న మినీ జెట్టింగ్ కమ్ డీ సిల్టింగ్ మిషన్

జూబ్లీహిల్స్, డిసెంబర్ 7 : సీవరేజీ ఓవర్ ఫ్లో సిటీ లక్ష్యంగా అక్టోబర్ 2 నుంచి డిసెంబర్ 31 వరకు 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్న హెచ్ఎం ఎస్‌బీ అధికారులు పూడికతీత పనులకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. సీవరేజీ పైపులైన్లలో వ్యర్థాల తొలగింపుకు ప్రత్యేక మిషన్‌లతో పనులు చేపడుతున్నారు. చిన్న గల్లీల్లోకి వెళ్లేందుకు గతంలో మినీ జెట్టింగ్ మిషన్లతో పనులు చేపట్టిన అధికారులు ఇటీవల మినీ జెట్టింగ్ కమ్ డీ సిల్టింగ్ మిషన్లను వినియోగిస్తున్నారు. మినీ ఎయిర్‌టెక్ మిషన్‌లతో మ్యాన్‌హోల్ నుంచి మ్యాన్‌హోల్‌కు కేవలం జెట్టింగ్ చేపడుతూ పనులు చేపడుతుండగా.. కొత్తగా ప్రవేశపెడుతున్న జెట్టింగ్ కమ్ డీ సిల్టింగ్ మిషన్‌తో జెట్టింగ్‌తో పాటు బకెట్ క్లీనింగ్ తరహా పనులు చేపడుతున్నారు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా యంత్రాలే జెట్టింగ్ (ఎయిర్ ప్రెషర్) చేపట్టి సిల్ట్‌ను బయటకు తీసుకుంటాయి. మ్యాన్‌హోల్స్‌లోకి మనుషులు దిగకుండా మానవ రహిత పనులు చేపట్టేందుకు పూడికతీత పనుల్లో పూర్తిగా యంత్రాల వినియోగాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కస్తూరి నరేందర్

మణికొండ, డిసెంబర్ 7 : ఆరోగ్యంపై అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మణికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కస్తూరి నరేందర్ సూచించారు. శ్రీరామ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, చరణ్ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ కస్తూరి నరేందర్ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. 500 మందికి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జి.వి.ఎస్.రావుస్, డాక్టర్ శ్రీనివాస భోగా, డాక్టర్ ఉమాలశ్రీరామ్, డాక్టర్ శ్రీకాంత్, కాలనీ ప్రెసిడెంట్ మనోహర్, సెక్రటరీ ప్రవీణ్, కాంతారావు, బాపూజీ, సీతారామదాసు, కనకాల శివరాం రెడ్డి, భరత్, డాక్టర్ పి.అవినాశ్, శివరామ కృష్ణ, డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. సంరక్షించాలి

మణికొండ, డిసెంబర్ 7 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కౌన్సిలర్ పద్మరావు అన్నారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.ఉపేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, అఖిల్ షైక్, ఆరిఫ్, మొహమ్మద్, సందీప్ రాజారెడ్డి, జస్వంత్, శేషు, విశ్వనాథ్, జగదీశ్, సుజాత, రూపా, విజయలక్ష్మి, రాధికా, లావణ్య, శ్యామల, స్వప్న, మహమూదు నిసా బేగం, సబీరా బేగం పాల్గొన్నారు.

పార్కులో బాత్‌రూమ్‌లు నిర్మించాలి

అల్కాపూర్ మహాత్మాగాంధీ పార్కులో బాత్‌రూమ్‌లు నిర్మించాలని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ నవీన్‌కుమార్ కోరారు. శనివారం కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసి సమస్య వివరించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ.. పార్కులో బాత్‌రూమ్‌లు కట్టడానికి 18 నెలల క్రితం తాను కౌన్సిల్‌లో ప్రతిపాదించగా మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా టెండర్ ప్రక్రియని పూర్తి చేసి నిర్మాణం చేయాలని కోరామని తెలిపారు. సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారన్నారు.

- మణికొండ

గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం
డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల విడుదల

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 7 : గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన్నట్లు ఎంపీడీవో మున్ని తెలిపారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిండం కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను విడుదల చేశారు. కేంద్రాల వారీగా ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిపై ఫిర్యాదులు ఈ నెల 12 తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని వివరించారు. గ్రామాల వారీగా పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను పంచాయతీ కార్యాలయం ఎదుట నోటీస్ బోర్డులో ఉంచుతాయన్నారు.

శ్రీరమణ చౌరస్తా నుంచి వాహనాలకు అనుమతి

అంబర్‌పేట, డిసెంబర్ 7: అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తాలో నిర్మితమవుతున్న ఫ్లైఓవర్ కారణంగా నిలిచిపోయిన వాహనాల రాకపోకలు శనివారం మళ్లీ మొదలయ్యాయి. అయితే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు మాత్రమే అనుమతిచ్చారు. నాలుగైదు ఏండ్లుగా బంద్ చేయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలనే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తైంది. తుది మెరుగులు దిద్దుతున్నారు. ఫ్లైఓవర్ కింద నుంచి వాహనాలు వెళ్లేందుకు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డును నిర్మించి నాలుగు నెలలు అయింది. కానీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు గల్లీల్లో నుంచి వెళ్తుండడంతో ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ అవుతున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబోలు నర్సింహారెడ్డి విషయాన్ని ట్రాఫిక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంతోష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు వాహనాలను అనుమతిస్తే ఇబ్బందులు రావొచ్చనే విషయాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు అనుమతించాలని నిర్ణయించారు. శనివారం మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు, ఎస్సై గోపీకిషన్‌రెడ్డి లైట్ వెహికిల్స్‌కు అనుమతిచ్చారు. ఈ సందర్భంగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబోలు నర్సింహారెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, కాలేరు మణికాంత్, కె.మధుసూదన్‌రెడ్డి, ఎ.అనిల్, కె.రామారావుయాదవ్, కె.లింగారావు, సీపీఎం నాయకుడు ఎం.మహేందర్ ఛే నెంబర్ చౌరస్తాకు చేరుకొని వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు.

దివ్యాంగుల అభివృద్ధికి కృషి

మలక్‌పేట : దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు ఆత్మ స్థైర్యం కోల్పోకుండా ఆత్మ విశ్వా సంతో ముందుకు రావాలని ఆమె సూచించారు. శనివారం సాయంత్రం మలక్‌పేట నల్లగొండ చౌరస్తాలోని వికలాంగుల సంక్షేమ భవన్ ఆవరణలోని బధిర విద్యార్థుల ఆశ్రమ పాఠశాలలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, వికలాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజలతో కలిసి మంత్రి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఫాసిస్టు విధానాన్ని ఎండగట్టాలి

ఖైరతాబాద్, డిసెంబర్ 7 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఫాసిస్టు విధానాన్ని ఎండగట్టాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తన ఫాసిస్టు విధానాలతో రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. అమెరికా ప్రభుత్వం అదాని, అతని అల్లుడిపై అతి పెద్ద కుంభకోణాన్ని ఆపాదిస్తూ అరెస్టు వారెంటు జారీ చేసినా ప్రధాని మోదీ ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తుందని ప్రశ్నించారు. అదానిని వెంటనే అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, కేవలం ఉచిత బస్సు, 200 యూనిట్ల కరెంటు మాత్రమే అమలవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష, వామపక్ష పార్టీలకు చెందిన వారిని అరెస్టులు చేయడం విచారకరమన్నారు. తద్వారా నియంత లక్షణాలు బహిర్గమవుతున్నాయన్నారు. కమ్యూనిస్టులు పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పోలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

బీ స్కూల్ ఫెయిర్ అండ్
ఎంబీఏ ఎక్స్‌పో ప్రారంభం

ఖైరతాబాద్, డిసెంబర్ 7 : ఐఐఎంసీ కళాశాల, అంబిషన్స్ కేరీర్ కౌన్సిలర్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం లక్డీకాపూల్‌లోని వాసవి కల్యాణ మండపంలో ' బీ స్కూల్ అండ్ ఎంబీఏ ఎక్స్‌పో - 2024 ' ను ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్‌తో కలిసి ప్రారంభించారు. ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల ద్వారా డిగ్రీ తదనంతర కోర్సులపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. ప్రస్తుతం నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా విభిన్న కోర్సులను పరిచయం చేస్తున్నారని, వీటిని అన్ని కళాశాలలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబిషన్స్ కేరీర్ కౌన్సిలర్ సంస్థ ప్రతినిధి సాయిరాం, తిరుమల రావు, కౌటిల్య, శ్రీధర్, సంతోషి పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి, రఘువీర్, తిరుమలరావు

ఉస్మానియా దవాఖాన నిర్మించకుండా చూడండి

అబిడ్స్, డిసెంబర్ 7 : గోషామహల్ ప్రాంతంలో ఉస్మానియా దవాఖాన నిర్మించకుండా చూడాలని గోషామహల్, చందన్‌వాడి స్థానికులు గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్‌ను కోరారు. శనివారం ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం సమర్పించారు. ఆర్‌టీఐ కో కన్వీనర్ జి. రాము మాట్లాడుతూ.. ప్రాంతంలో దవాఖాన నిర్మించడం వలన ప్రజలు ఇబ్బందుల పాలవుతారన్నారు. ప్రాంతంలో అనేక పాఠశాలలు ఉన్నాయని, ఆయా పాఠశాలల విద్యార్థులకు ఇబ్బందులు తప్పవన్నారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో రెయిన్ హార్వెస్టింగ్ జరుగుతోందని, దవాఖానను ఇక్కడ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుదుందన్నారు. ఇక్కడ నిర్మించాలనుకునే దవాఖానను నగర శివారు ప్రాంతంలో నిర్మించాలని కోరారు.

కరెంట్ కష్టాలు లేకుండా చూడండి

అబిడ్స్ : ప్రజలకు కరెంట్ కష్టాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం టోలిచౌకిలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగం పెరుగుతుందని, దీనికి తగ్గట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, డీఈలు సుధీర్, ఫర్హత్‌అలీ పాల్గొన్నారు.

రాణించాలంటే కష్టపడి చదవాలి

ఖైరతాబాద్, డిసెంబర్ 7 : విద్యార్థులు రాణించాలంటే అది విద్య ద్వారానే సాధ్యమవుతుందని, కష్టపడి చదువాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగరం పిలుపునిచ్చారు. సోమాజిగూడలోని విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ విద్యార్థినులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వీసీ ప్రొఫెసర్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్, కళాశాల వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ డాక్టర్ ఫిలోమినా, కార్యదర్శి చిన్నమ్మతో కలిసి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. సమాజంలో విద్య విలువైందని, తద్వారా జ్ఞానం పెంపొందుతుందన్నారు. చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించిన వారు సమాజానికి తమవంతు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల సాంస్కృతిక కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ సావిత్రి, ప్రొఫెసర్ ఎ. ప్యాట్రిక్ పాల్గొన్నారు.